# చేరువ

కె.వి.యస్.వర్మ

పరుగు పరుగున ఇంటికొచ్చాడు కుమార్ పుస్తకాల సంచీ గూట్లో పెట్టి,

అమ్మా, అన్నం పెట్టు అన్నాడు

శాంతమ్మ వంటింట్లోంచి ముందు గదిలోకొచ్చి, దుమ్ము పట్టిన మనవడి కాళ్ళ వంక చూస్తూ

ముందు కాళ్ళు కడుక్కునిరా ఈలోగా అన్నం వడ్డిస్తాను అంది

బేగా పెట్టమ్మా అని కుమార్ పెరట్లోకెళ్ళాడు

చెంబుతో నీళ్ళు తీసుకుని కాళ్ళు, చేతులూ కడుక్కున్నాడు

ఇంతలో శాంతమ్మ అన్నం వడ్డించింది కుమార్, కంచం ముందు కూర్చుని అన్నంలో కూర కలుపుకుంటూ,

అమ్మా, ఇవేళ మా బడిలో 'లవకుశ' సినిమా చూపించారు బలే బాగుంది అన్నాడు

ముందు అన్నం తినరా తర్వాత కబుర్లు చెబుదువుగాని అంది శాంతమ్మ

అన్నం ముద్ద నోట్లో పెట్టుకొని తింటూ, సినిమా, సినిమా కథ ఎంత వేగిరం చెప్పేద్దామా అన్న ఆత్రుతలో వున్నాడు కుమార్

గబగబా ఎవరో తరుముతున్నట్టు అన్నం తింటున్న కుమార్‌ను చూస్తూ

వీడెంత చురుకో, ఆడేటప్పుడు ఆడుకుంటాడు చదివేటప్పుడు చదువుకుంటాడు అనుకుంది శాంతమ్మ అభిమానంగా, ప్రేమగా

చిన్నప్పుడు రాజారావు వీడంత చురుకుగా వుండేవాడు కాదు చాలా నెమ్మది ఆటలు పెద్దగా ఆడేవాడు కాదు ఎప్పుడూ పుస్తకాలు చదువుకుంటూనే వుండేవాడు చదివిన చదువు వృథాగా పోలేదు మంచి ఉద్యోగమే వచ్చింది

'అమ్మా కుశలవులు నా అంతే వున్నారు అయితేనేం! రాముడితో ఎంత బాగా యుద్ధం చేశారో తెలుసా? పాటలు కూడా బలేగా పాడారు"

కుమార్ మాటలకు ఆలోచన్ల నుంచి బయట పడింది శాంతమ్మ

ఆ కథ నాకూ తెలుసులేరా చిరునవ్వుతో అంది

ఆ సినిమా నువ్వెప్పుడు చూశావు?'

సినిమా చూడలేదు అయినా నాకా కథ తెలుసు '

కథ చెప్పడానికి కుదరక పోవటంతో కుమార్ నీరసపడిపోయాడు అన్నం తిని లేచాడు

ఒరే ఇవేళ 'మీ నాన్న పట్నం నుంచి వస్తున్నాడురా అంది శాంతమ్మ

వాడి మొహంమీద అకస్మాత్తుగా అనుకోని ఓ నీడ పడింది 'అలాగా' అన్నట్టు చూసి, ఆడుకోడానికి బయటకు పరుగెత్తాడు

కంచం కడుగుతూ రుక్మిణీ ఎక్కడ పెత్తనాలు చేస్తోందో, తను కూడా వచ్చేస్తే ఇద్దరం భోం చేయవచ్చును అనుకుంది శాంతమ్మ

అంతలోనే రుక్మిణి వచ్చింది

ఎక్కడికి పోయావే, అన్నం వడ్డించనా అంది శాంతమ్మ కంచం దులుపుతూ

ఇంకా వద్దమ్మా అన్నయ్య వచ్చాక ఇద్దరం తింటాం నువ్వు తినేసెయ్

మీ అన్నయ్య ఏ రాత్రికొస్తాడో? అప్పటిదాకా ఎందుకు కూచోడం నువ్వు కూడా తినేసెయ్ అని శాంతమ్మ ఇద్దరికీ అన్నం వడ్డించింది

కొంత సేపటికి కుమార్ ఇంట్లోకి వచ్చాడు భోజనం చేస్తున్న రుక్మిణి ముందు కూర్చుని,

అత్తా ఇవాళ మా బడిలో సినిమా చూశానోచ్ అన్నాడు

ఏం సిన్మారా

లవకుశ

ఆ సిన్మా నేనెప్పుడో చూశానోచ్ అంది రుక్మిణి

అన్నీ అబద్ధాలు మనూర్లో సినిమాహాలు లేదుగా

'మనూర్లో లేకపోతే పట్నంలో వుందిగా మీ నాన్నా, అమ్మా, నేనూ ఆ సిన్మా చూశాం నువ్వప్పటికి పుట్టనే లేదు

అమ్మా, 'లవకుశ' సినిమా చూడలేదన్నావేం

అబ్బబ్బ నీతో అంతా గొడవేరా 'అమ్మ' అంటే పట్నంలో వున్న మీ అమ్మ అన్న మాట నువ్వేమో అమ్మనూ అమ్మే అంటావు నాన్నమ్మనూ అమ్మే అంటావు అంది రుక్మిణి కల్పించుకుంటూ

నిన్ను చూసే వాడలా పిలుస్తున్నాడు అంది శాంతమ్మ ఎడం చేత్తో కుమార్ తల నిమురుతూ

నిద్రొస్తోంది రామ్మా పడుకుందాం' అన్నాడు కుమార్ ఆమె చెయ్యి పట్టి లాగుతూ

నువ్వు పడుకో నాన్న వచ్చాక నేను పడుకుంటాను అని కుమార్‌ను మంచంమీద పడుకోబెట్టి, దుప్పటి కప్పింది

కుమార్ కబుర్లు చెబుతూ నిద్రపోయాడు ఓ అర గంటకు రాజారావు వచ్చాడు

కాళ్ళూ చేతులూ కడుక్కుని కంచం ముందు కూర్చుంటూ,

'అమ్మా ఒంట్లో బావుంటుందా" అడిగాడు రాజారావు

ఏం బాగులేరా? రుక్మిణి పెళ్ళయ్యే వరకూ మనసు స్థిమితపడదు. కోడలు పద్మ కులాసాగా వుందా"

"కులాసాగానే వుంది" అని, "కుమార్ ఏడీ' అన్నాడు రాజారావు

ఇప్పుడే పడుకున్నాడు లేపనా

వద్దులే నిద్రపోనీ అని చెల్లెలితోనూ, తల్లితోనూ కబుర్లు చెబుతూ భోజనం చేశాడు

పెరట్లోకి వెళ్ళి చెయ్యి కడుక్కుని, తువాలుతో తుడుచుకుంటూ,

అమ్మా, రేపు కుమార్‌ను పట్నం తీసుకుపోతాను పద్మ కూడా వాణ్ణి చూడాలంటోంది ఈ వేసవుల్లో ఇంకెలానూ వాణ్ణి అక్కడి స్కూల్లో వేయాలి కదా, కాస్త అలవాటు అవుతుంది కూడానూ అన్నాడు రాజారావు

అలాగేలేరా ఉత్తరం రాశావు కదా వాడి బట్టలన్నీ పెట్టెలో సర్ది వుంచాను అంది శాంతమ్మ

తర్వాత, ఆమె కుమార్‌ను పక్కకు జరిపి, తనూ పడుకుంది రేపు కుమార్ పట్నం వెళ్ళిపోతాడంటే ఆమెకదో దిగులుగా వుంది కుమార్‌ను దగ్గరకు తీసుకుని, నుదుటి మీద ముద్దు పెట్టుకుంది

మూడేళ్ళ వయస్సప్పుడు కుమార్‌ను తన దగ్గరుంచారు వాడికిప్పుడు తొమ్మిదేళ్ళు నిండుతున్నాయి

కుమార్ పట్నం వెళ్ళిపోతే తనకేమి తోచదు వాడి అల్లరితో, కబుర్లతో ఇన్నాళ్ళూ ఇల్లు కళకళలాడుతూ వుంది రేపట్నుంచి బోసిపోతుంది

నిజానికి కొడుకు రాజారావు కంటే కుమార్‌నే తను ఎంతో జాగ్రత్తగా పెంచింది కుమార్‌కు కాస్త ఒళ్ళు వెచ్చబడితే చాలు తనెంతో కంగారు పడి పోయేది

రెండేళ్ళ క్రితం ఓ రోజున కుమార్ పొద్దుపోయినా ఇంటికి రాలేదు తనెంతో కంగారు పడిపోయింది అన్ని ఇళ్ళూ వెదికింది కనిపించలేదు తనకు ఏడుపొచ్చేసింది అమ్మా కుమార్ ఏడీ అని రాజారావు అడిగితే తనేం సమాధానం చెప్పాలి? అనుకుంటూ వెక్కి వెక్కి ఏడ్చింది

ఆ రాత్రి ఏడున్నర గంటలకు కుమార్ ఇంటికొచ్చాడు వాణ్ణి చూడగానే మొదట ఎంతో ఆనందం కలిగిం... తర్వాత కోపం వచ్చేసింది ఇంతసేపూ ఎక్కడున్నావని అడిగింది వీరయ్య బాబాయితో పొలం వెళ్ళానని చెప్పాడు. 'చెప్పా పెట్టకుండా అలా వెళ్ళొచ్చా' అంటూ వాడి తల మీద రెండు మొట్టికాయ లేసింది కుమార్ ఇంటి పెంకులెగిరిపోయేలా ఏడుపు మొదలెట్టాడు మళ్ళీ వాణ్ణి బుజ్జగించేటప్పటికి తల ప్రాణం తోకకు వచ్చింది

శాంతమ్మ పక్కకు ఒత్తిగిల్లి, కుమార్ తల నిమిరింది కుర్ర వెధవ ఎన్ని కబుర్లు చెబుతాడో?

మాటకు మాట ఎంతబేగా అనేస్తాడో!

మొన్న ఎండలో ఆటలాడుతూంటే ఆటలు చాల్లే ఇక లోపలికి రా ఎండలో అలా ఆటలాడితే కాకిలా నల్లబడిపోతావ్ అంది తను అంతే వెంటనే కావ్ కావ్ కావ్ అంటూ అరుస్తూ గెంతుతూ ఇంట్లోకొచ్చి తనను చుట్టేసుకున్నాడు వాడి చేష్టలకు వచ్చే నవ్వును ఆపుకోవడం కష్టమయ్యింది

కుమార్ లేకుండా తనీ ఇంట్లో మసలగలదా? వాడు మాత్రం తనను విడిచి వుండగలడా? కొన్ని రోజులు బెంగపెట్టుకున్నా తల్లి ప్రేమలో తనను మరచిపోతాడు ఇలా అనుకోగానే ఆమె గుండెల్లో ఏదో గుచ్చుకున్నట్లనిపించింది

ఓ నిట్టూర్పు విడిచి, కళ్ళు మూసుకుంది

* * * * * * *

ఉదయం ఏడు గంటలు ఇంకా చలి తగ్గలేదు

రాజారావు కాఫీ తాగుతూ, అటుగా పోతున్న కుమార్‌ను ఇలా రా అని ప్రేమగా పిలిచాడు

కుమార్ తండ్రి వంక ఓసారి చూసి వంట గదిలోకి పారిపోయాడు

రాజారావు మనసు చివుక్కుమంది

కాఫీ గ్లాసు వంట గదిలో పెడుతూ,

కుమార్ సాయంత్రం బస్సులో పట్నం వెళ్తావా అన్నాడు రాజారావు కొడుకుతో

తాను అన్నట్టు తల అడ్డంగా వూపాడు కుమార్

వెళ్ళమ్మా మీ అమ్మకు నిన్ను చూడాలని వుందట అంది శాంతమ్మ కుమార్ గెడ్డం పట్టుకుని

వాడు మాట్లాడలేదు

ఆ పగలంతా కుమార్ తండ్రిని తప్పుకుని తిరిగాడు రోజా రుక్మిణి కూడా కూడా తిరిగేవాడల్లా ఆమె రాజారావుతో కబుర్లు చెబుతూ వుండడంతో ఆ ఛాయలకే పోలేదు

మధ్యాహ్నం రెండు గంటలయింది ఎండ వెచ్చ



విచ్చుగా వుంది చెల్లెలితో కబుర్లు చెబుతున్న రాజారావు తన ముందు నుంచి వెళ్తున్న కుమార్‌ను చూసి, బలవంతంగా పట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు

కుమార్ ఏడుపు మొహం పెట్టి, తండ్రి చేతుల్ని వదిలించుకోబోయాడు

రాజారావు గట్టిగా పట్టుకుని,

మనం వూరెళ్లాక అక్కడ నీకు మంచి సినిమాలు చూపిస్తాను జూకి తీసుకెళ్తాను అన్నాడు

నేను నీతో రాను అన్నాడు కుమార్

రాజారావుకు కోపం వచ్చింది

బతిమాలుతుంటే మరీ గీర చేస్తున్నావేమిటి' అని ఓ దిప్పకాయ వేశాడు

కుమార్ బేర్‌మంటూ లాగు తడిపేసుకున్నాడు

లేదు లేరా' అంటూ శాంతమ్మ మనవణ్ని దగ్గరకు తీసుకుని అలా బయపెట్టేయకు అని కొడుకును మందలించింది

రాజారావు మొహం గంటు పెట్టుకుని వెళ్లి మధ్య గదిలో మంచంమీద పడుకున్నాడు చిన్న కునుకు తీసి లేచేసరికి నాలుగు గంటలయింది

శీతగాలి మెల్లిగా మొదలవుతోంది

"అమ్మా కుమార్‌ను పిలు బస్ వచ్చే వేళయింది అన్నాడు రాజారావు

శాంతమ్మ వీధిలోకెళ్లింది కొందరు పిల్లలు 'కబడ్డీ ఆడుతున్నారు వాళ్లలో కుమార్ లేడు దాంతో శాంతమ్మ ఇంటికి తిరిగొచ్చి,

రుక్మిణీ' బాబాయి గారింట్లో వున్నాడేమో వెళ్లి చూడు అంది

రుక్మిణి అద్దం దగ్గరకెళ్లి, ముంగురులు సవరించుకుని దువ్వెనతో తల చెక్కుకుని బయల్దేరింది

ప్రయాణానికి అంతా తయారై కుమార్ కోసం ఎదురు చూస్తున్నాడు రాజారావు

పది నిముషాలయినా రుక్మిణి తిరిగిరాలేదు

ఇంతలో బస్సు వచ్చేసింది రాజారావుకేమీ పాలుపోలేదు కుమార్ కోసం వీధి అరుగు మీద నిలబడి చూశాడు రుక్మిణి గబగబా నడిచి వస్తోంది పక్కన కుమార్ లేడు

ఇంటిముందుకొచ్చిన బస్సు ఆపుజేసి,

# చేరువ

అమ్మా, వెళ్తొస్తాను ఇవేళ కూడా వుండడానికి నాకు సెలవు లేదు నువ్వు మరీ గారం పెట్టినట్టున్నావ్ కుమార్ భయం, భక్తి లేకుండా తయారయ్యాడు అని విసుగ్గా అనేసి రాజారావు బస్సెక్కేసాడు

బస్సు కదిలింది

పద్మను అడిగినట్టు చెప్పు అని అరిచింది శాంతమ్మ

ఎదురుగా నడిచి వస్తున్న రుక్మిణికి టాటా చెప్పాడు రాజారావు, దుమ్ము రేపుకుంటూ బస్సు వూరు దాటింది

రాజారావు సీటుకు జేరబడి కళ్లు మూసుకున్నాడు.

పద్మ ఆదిలోనే చెప్పింది – కుమార్‌ను తన తల్లి దగ్గర వుంచొద్దని 'వాడిని చూడకపోతే నేనుండలేను పోనీ నేను వుద్యోగం మానేస్తాను లేదా ఆయాను పెడదాం కుమార్‌ను చూడడానికి" అంది పద్మ

పోనీ అమ్మనూ, చెల్లినీ పట్నం తీసుకొచ్చేస్తే "

పద్మా, తనూ లెక్క వేశారు ఖర్చు రెట్టింపయ్యేలా వుంది కానీ, పద్మా, తనూ ఆఫీసులకు వెళ్లిపోతే కుమార్‌ను చూసే వాళ్లుండరు ఆమె ఉద్యోగం మానేస్తే ఇంటి కోసం చేసిన అప్పు తీర్చడం కష్టమే కాదు, అసాధ్యం కూడా ఇలా ఆలోచించి కుమార్‌ను తనే తల్లి దగ్గరకు తీసుకొచ్చి వుంచేడు

కేవలం కుటుంబం గడవడానికే అయితే తనొక్కడూ ఉద్యోగం చేస్తే చాలును చెల్లెలి పెళ్లి చెయ్యాల్సిన బాధ్యత తనపై వుంది

ఇప్పుడైతే కుమార్ పెద్దాడయ్యాడు కాబట్టి స్కూల్లో దిగబెట్టి ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు తనే తీసుకు రావచ్చు

కుమార్ అయిదో తరగతి పరీక్షలు రాస్తాడు ఆ వూళ్లో హైస్కూలు లేదు ఈ వేసవుల్లో పట్నం తీసుకొచ్చి హైస్కూల్లో చేర్చక ఎలానూ తప్పదు అందుకు అలవాటు చేద్దామని ప్రయత్నం చేస్తే, వాడేమో తనను పరాయివాణ్ని చూస్తున్నట్టు చూస్తున్నాడు

ఇప్పుడేం చేయాలి?

కుమార్‌ను తల్లి దగ్గరుంచి తప్పు చేసేనేమో? కొడుకు నుంచి పొందాల్సిన ఆనందం తాము కొంత కోల్పోయినట్టే తల్లిదండ్రుల క్రమశిక్షణను వాడూ కొంత పోగొట్టుకున్నాడు ఇలా కొంత నష్టపోయినా రుక్మిణి పెళ్లికి కావలసిన డబ్బును తను సమకూర్చగలిగాడు సంబంధాలు చూస్తున్నారు మంచి సంబంధం దొరికితే ఆమె పెళ్లి జరిగిపోతుంది

ఓ సమస్య తీరబోతోంటే కుమార్ మరో సమస్యగా తయారయ్యాడు కుమార్‌ను తమతో వుంచుకోవాలంటే ఇంక ఒక్కటే మార్గం పద్మ చేత ఓ నెల రోజులు శెలవు పెట్టించి తమ వూరు పంపాలి పద్మతో చనువు పెరిగితే తప్ప కుమార్ అక్కడ నుంచి కదలడు–

ఇలా అనుకున్నాక రాజారావు మనసు శాంతించింది

* * * * * * *

చీకట్లు చుట్టుముట్టాయి

శాంతమ్మ వీధి అరుగు మీద కూర్చుని కుమార్ కోసం ఎదురు చూస్తోంది రుక్మిణి కుమార్‌ను వెదకడానికి మళ్లీ వెళ్లి ఇంకా తిరిగి రాలేదు

శాంతమ్మ దీపం వెలిగిద్దామనుకుంది లేవ బుద్ధి కాలేదు ఇంతలో తన చీర కుచ్చిళ్లు ఎవరో లాగుతున్నట్టనిపించి, తల వంచి మెట్ల మీదకి చూసింది

కుమార్ మోకాళ్ల మీద ఒంగుని వున్నవాడల్లా, 'బొయ్' అన్నాడు నాన్నమ్మను హడలించుతూ

వెధవ పిల్లోడా ఇంతసేపూ ఎక్కడికి పోయావురా? మీ నాన్న నీ కోసం చూసి చూసి పట్నం వెళ్లిపోయాడు అంది శాంతమ్మ కోపంగా

పీడా పోయింది నేను నీ దగ్గరే వుంటానుగా ఇంచక్కా అన్నాడు కుమార్ అరుగు మీదకొచ్చి నాన్నమ్మ ఒళ్లో తల పెట్టుకుంటూ

ఇన్నాళ్లూ మనసులో దొలుస్తున్న ఓ సమస్య శాంతమ్మకు తొలగిపోయింది

రుక్మిణి పెళ్లి అయిపోతే, తన భవిష్యత్ ఏమిటా అని శాంతమ్మ అప్పుడప్పుడూ బెంగపడేది ఈ వరసను కుమార్ కోసమైనా కొడుకు తనను పట్నం తీసుకుపోక తప్పదు అనుకుంది శాంతమ్మ మనవడి తల నిమురుతూ నిశ్చింతగా □

Do it yourself at home with..
DELUXE
MINI PRINTING PRESS
A FRIEND IN NEED
A miracle in a GIFT PACK
Prepare Rubber stamps and print colourfully Letter Heads, Cards etc
Price—Rs. 35/- only
Postage Rs 15/- Extra
For V P Parcel write to –
YOUNG INDIA TRADING CORPN
161/1, Mahatma Gandhi Road, Calcutta-7

DIVYA DIVYA DIVYA DIVYA DIVYA DIVYA DIVYA
BALL PENS
PENS
NIBS
INKS
REFILLS
GIFT SETS
A JAI PRODUCT

విజ్ఞానానికి • వినోదానికి
• వికాసానికి
పిల్లల సచిత్ర మాస పత్రిక
బాలరంజని
చదవండి!
వెల రూ. 2/
ఆంధ్రపత్రిక ప్రచురణ